
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 23 ఆగస్టు 2024




'అన్నమయ్య' బాధ్యులపై చర్యలేవీ..?

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం గురించి దేశ చరిత్రలోనే ఎంతో విషాద దుర్ఘటన అని, ఇది కచ్చితంగా మానవ తప్పిదమేనని కేంద్ర ప్రభుత్వం నాటి పార్లమెంట్‌లోనే ప్రకటించింది. గత ప్రభుత్వ పాలకులు, సంబంధిత ప్రాజెక్టు అధికారుల ఉమ్మడి తప్పిదం కారణంగానే ఈ ప్రాజెక్టు తెగిపోయింది. ఈ దుర్ఘటనకు సంబంధించి ఇంతవరకు ఎవరిపై చర్యలు తీసుకోలేదు. అధికారులపై చర్యలు తీసుకుంటే ఆ తప్పిదం ప్రభుత్వంపై పడుతుందని జగన్ సర్కారు ప్రకృతిపై నెపం నెట్టేసి చేతులు దులుపుకుంది. ఇంకా చెప్పాలంటే.. ప్రాజెక్టు తెగిపోయినప్పుడు అందుకు కారణమైన ప్రధాన అధికారులే నేటికీ కొనసాగుతుండడం విశేషం. ఒక దుర్ఘటన జరిగినప్పుడు సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యల కింద వారిని బదిలీ చేయడమో లేకుంటే సస్పెండ్ చేయడమో జరుగుతుంది. ప్రాజెక్టు తెగిపోయి ఏకంగా 40 మంది ప్రాణాలు కోల్పోయి, 450 ఇళ్లు కొట్టుకుపోయి, వేలాది పశువులు చనిపోయి, వేల ఎకరాల భూమి ఇసుక పాలై 3 మండలాలను ముంచెత్తితే... ఒక్క అధికారిపై కూడా చర్య తీసుకోకపోవడం జగన్ ప్రభుత్వ పక్షపాత పాలనకు మచ్చుతునక. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలవుతున్నా ఆ దుర్ఘటనకు బాధ్యులైన అధికారులే నేటికీ కొనసాగుతుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

- అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై అన్నీ అనుమానాలే
- పునర్నిర్మాణం రీటెండర్ల అవినీతిపై నిగ్గు తేల్చరా?
- నేడు ఉపముఖ్యమంత్రి పవన్ పర్యటన
- రాజంపేట ప్రాంతీయుల్లో చిగురిస్తున్న కోటి ఆశలు


మూడేళ్ల కిందట తెగిపోయి అనాథలా మారిన అన్నమయ్య ప్రాజెక్టు ఏరియల్ వ్యూ




ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోవడంతో అలంకార ప్రాయంగా స్పిల్‌వే ప్రాంతం

రాజంపేట, ఆగస్టు 22: అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వెనక.. గత ప్రభుత్వ వైఫల్యం, పాలకుల ఇసుక దోపిడీ, అధికారుల నిర్లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. 2.50 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిండడానికి పెద్ద సమయం పట్టదు. దుర్ఘటన జరిగినప్పుడు ఏకంగా 5.60 లక్షల క్యూసెక్కుల వరదనీరు ఒక్కసారిగా ప్రాజెక్టులో పడిందని అందువల్లే ప్రాజెక్టు తెగిపోయిందని ఈ విషయంలో తమ తప్పులేదన్నట్టు అధికారులు, అప్పటి వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. 2021 నవంబరు 19వ తేదీ తెల్లవారుజామున ప్రాజెక్టు తెగిపోయింది. దానికి రెండు రోజులు ముందుగానే ప్రాజెక్టులో 1.50 లక్షల క్యూసెక్కుల నీరు నిల్వ ఉంది. దిగువ ప్రాంతంలో ఇంతటి భారీవర్షాలు కురుస్తున్నప్పుడు కేవలం 2.50 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో ఉన్న నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదిలివేయాలి. అలా చేయలేదు. 5.60 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చిందంటే కేవలం గంటలోనే ప్రాజెక్టు నిండిపోతుంది. ఉన్న నిల్వ నీటిని వదులుతూ, భారీ వరదనీరు వచ్చినప్పుడు అప్రమత్తమై ముందుగానే అన్నిగేట్లు ఎత్తి ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని ఏ చిన్నపిల్లాడిని అడిగినా చెబుతారు. దిగువ ప్రాంతంలో నాటి వైసీపీ పాలకులు భారీఎత్తున ఇసుక తోలేందుకు ఉంచిన టిప్పర్లు, హిటాచీలు కొట్టుకుపోతాయనే ప్రాజెక్టు గేట్లు ఎత్తలేదనే ఆరోపణలు ఇప్పటికీ వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వమైనా ఈ దుర్ఘటనపై న్యాయ విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ప్రాజెక్టు తెగిపోవడానికి గల కారణాలపై న్యాయ నిపుణులచే విచారణ చేయించి ఇందులో నిజానిజాలను బయట పెట్టాల్సిన అవసరం ఉంది.

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం సాధ్యమేనా?

అన్నమయ్య ప్రాజెక్టు పనర్నిర్మాణం అదే ప్రాంతంలో సాధ్యమయ్యే పనికాదని అధికారులే చెప్పుకుంటున్నారు. 1969లో నాటి పెద్దలు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. నిధుల లేమివల్ల ఆలస్యమై.. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతంలో నది వెడల్పు తక్కువగా ఉండడం, కొండమార్గం ఉండడం, కొండకు అటు ఇటు లోయలు ఉండడం, ఆ ప్రాంతంలో గట్టిరాయి లేకపోవడం.. ఇలాంటి కారణాల వల్ల కేవలం 2.50 టీఎంసీల సామర్థ్యం ఉండే మధ్యతరహా ప్రాజెక్టును రూ.70 కోట్ల ఖర్చుతో పడుతూ లేస్తూ దాదాపు 30 ఏళ్లకు నిర్మించారు. 22 ఏళ్ల కిందట ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుంచి పూర్తిస్థాయి నీటిని ఏనాడూ నిల్వ ఉంచలేదు. రెండుసార్లు గేట్లు కొట్టుకుపోవడం, వర్షాలు సక్రమంగా పడకపోవడం ప్రధాన కారణాలు. అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు 22,500 ఎకరాలకు ఏరోజు నీరందించలేదు. అంటే రూ.70 కోట్ల ఖర్చుతో ఏర్పాటైన ఈ ప్రాజెక్టు ఏరోజు అనుకున్న ఫలితం ఇవ్వలేదు. ఒక పెద్దపాటి చెరువులానే అన్నమయ్య ప్రాజెక్టు మారిపోయింది. ఈ ప్రాజెక్టు తెగిపోయినప్పుడు మాత్రం వేలకోట్ల రూపాయల నష్టం చేకూర్చింది. 40 మంది మనుషులను, వేలాది పశువులను బలిగొంది. వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేసి ఇప్పటికీ సాగుకు పనికిరాకుండా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2.50 టీఎంసీల నీరు నిలిచే చోట వైసీపీ ప్రభుత్వం ఏకంగా 10 టీఎంసీల సామర్థ్యంతో రూ.800 కోట్లతో ప్రాజెక్టు పునర్నిర్మిస్తామని చెప్పడం అందరిలో అనుమానాలు రేకెత్తించింది. కారణం ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణం పేరుతో రూ.800 కోట్లకు టెండర్లు పిలిచి ఆ పనులను చేజిక్కించుకుని తిరిగి కోట్లు గడించవచ్చునన్న దురాశ తప్ప వీరికి సదుద్దేశం ఏమాత్రం లేదనే విమర్శలు వచ్చాయి.

ప్రాజెక్టు తెంచింది వైసీపీ పెద్దలే. తిరిగి పునర్నిర్మాణం పేరిట కోట్లు కొల్లగొట్టేదీ వాళ్లే అని పలువురు చర్చించుకున్నారు. అయితే సాధారణ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం కుప్పకూలిపోవడంతో అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం పేరిట కోట్లు దోచుకోవాలనుకున్న వారి ఆలోచనలకు గండి పడింది.

పక్కా ప్రణాళికతో నిర్మించాలి


నూతన ప్రభుత్వంపై ఈ ప్రాంత ఆయకట్టు రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కట్టకముందు చెయ్యేరు నది ద్వారా రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల ప్రజలకు ఏడాది పొడవునా వర్షం నీటితో 3 పంటలు పండుతూ ఈ ప్రాంతమంతా కోనసీమగా ఉండేది. ఎగువ ప్రాంతంలో ప్రాజెక్టు కట్టడం వల్ల ఈ మూడు మండలాలు కరువు ప్రాంతాలుగా మారిపోయాయి. కావున దిగువ ప్రాంతాలను, ఎగువ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ నీటిని నిల్వ ఉంచే ప్రాంతాన్ని గుర్తించి ఇటువంటి దుర్ఘటన జరగకుండా పక్కా ప్రణాళికతో ప్రాజెక్టు రూపకల్పన జరగాల్సి ఉంది. అలా కాదంటే ఇక్కడ ప్రాజెక్టు పునర్నిర్మించినా ఎక్కువ మందికి ఉపయోగకరంగా ఉండదని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శుక్రవారం ఇక్కడకు రానుండటంతో.. ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణంపై సంబంధిత జలవనరులశాఖ నిపుణులతో చర్చించి ప్రాజెక్టు పునర్నిర్మిస్తారని, ఎగువ, దిగువ ప్రాంత ప్రజలకు సమన్యాయం చేస్తారని రాజంపేట నియోజకవర్గ ప్రజలు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారుల వివరణ కోసం ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తాం..



అధికారులు, రైతులు, ప్రజలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యంగానే అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తాం. కూటమి ప్రభుత్వం దీనిపై పూర్తిగా న్యాయం చేస్తుంది. ఎగువ, దిగువ ప్రాంతాల ప్రజలకు, అన్నదాతలకు ప్రయోజనం కలిగే రీతిలో ప్రాజెక్టు డిజైన్ చేసి నిర్మిస్తాం. గత పాలకులు చేసిన తప్పిదాలపై తప్పకుండా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. సాగు, తాగునీరు అందేదిశగా ప్రాజెక్టును ఏర్పాటు చేస్తాం.

- సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ ఇన్‌చార్జి, రాజంపేట


ప్రాజెక్టు తెగిపోవడంతో వెలవెలబోతున్న అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు


ప్రాజెక్టులో చుక్కనీరు లేకపోవడంతో చూపుడాయకంగా మారిన అన్నమయ్య సాగునీటి కాలువ


ప్రాజెక్టు నీరు లేకపోవడంతో బీడుగా మారిన ఆయకట్టు భూమి

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..



ఈ ప్రాజెక్టు తెగిపోవడానికి కారణమైన వారిపై పక్కాగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు పేరుతో విడుదలయ్యే సొమ్మును పునర్నిర్మాణం పేరిట తినేయడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ చేసి ఎగువ, దిగువ ప్రాంతాలకు సమన్యాయం చేయాలి. సాగు, తాగునీరు రెండు ప్రాంతాలకు అందేటట్లు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలి.

- సాయిలోకేశ్, బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి..



కూటమి ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై పూర్తిస్థాయి దృష్టి పెట్టాలి. జగన్ ప్రభుత్వం చేసిన తప్పిదాలు కూటమి ప్రభుత్వం చేస్తే ప్రజలు క్షమించరు. గత పాలకుల తప్పిదాలను బయటపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలి. అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వంతో జాతీయ విపత్తు నిధులను తెప్పించుకుని రాష్ట్ర ప్రభుత్వం తమ నిధులు కలిపి ప్రాజెక్టు నిర్మించాలి.

- మహేశ్, సీపీఐ నాయకుడు, రాజంపేట

పవన్‌కళ్యాణ్ సభకు ఏర్పాట్లు పూర్తి

- మైసూరివారిపల్లెకు చేరుకున్న అన్ని శాఖల అధికారులు
- కట్టుదిట్టంగా ఏర్పాట్లు, పర్యవేక్షించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, ఆగస్టు 22: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె గ్రామ పంచాయితీ కేంద్రంలో శుక్రవారం ఉదయం నిర్వహించే గ్రామసభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు మైసూరివారిపల్లెకు చేరుకుని పనులను పర్యవేక్షించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయవాడ నుంచి పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానంలో రేణిగుంటకు చేరుకుంటారు. అక్కడ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు స్వాగతం పలుకుతారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో మైసూరివారిపల్లెకు చేరుకుని గ్రామసభలో పాల్గొంటారు. ప్రజల దగ్గర నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం రైల్వేకోడూరు నుంచి రాజంపేటలోని పులపుత్తూరు ప్రాంతాన్ని సందర్శిస్తారని జనసేన నాయకులు తెలిపారు. కుక్కలదొడ్డి నుంచి రాజంపేట వరకు 500 మంది పోలీసులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

సభా ఏర్పాట్లను ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, జనసేన సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్‌లు పగడాల వెంకటేష్, జోగినేని మణి, సీనియర్ నాయకుడు పగడాల చంద్రశేఖర్ తదితరులు సభా ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.


పవన్‌కళ్యాణ్ పాల్గొనే సభ స్థలంలో పూర్తయిన ఏర్పాట్లు


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి

సమస్యలు పరిష్కరించండి

- హైవేపై ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల ధర్నా



సిద్దవటం, ఆగస్టు 22: మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని హెచ్‌పీసీఎల్ ఆయిల్ కంపెనీ వద్ద గురువారం ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్లు కడప-చెన్నై రహదారిపై ధర్నా చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, డిపో మేనేజర్ మొండి వైఖరి నశించాలి అంటూ 250 మంది డ్రైవర్లు వాహనాలను నిలిపివేసి రోడ్డుపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు షరీఫ్ హుస్సేన్ మాట్లాడుతూ డ్రైవర్ ఉద్యోగం చేయడం కష్టతరమైందని, డిపో మేనేజర్ సమయపాలన దిశగా అమలు చేయడం లేదని, రాత్రిపూట సమయం దాటిన తర్వాత ట్యాంకర్లు నింపి పంపుతున్నారని దీంతో గమ్యస్థానానికి చేరుకోలేకపోతున్నామని తెలిపారు. పెట్రోల్ బంకుల యజమానులు రాత్రిపూట తీసుకోవడం లేదని, ఉదయం వరకు వాహనాలను అక్కడే ఉంచాల్సి వస్తోందని వాపోయారు. నోటీసు బోర్డులో టైమింగ్ పెట్టినా కూడా అవన్నీ కూడా పట్టించుకోవడం లేదని గతంలో ఉన్న డీఎం ఇలాగే చేశారని ఇప్పుడు ఉన్న డీఎం అదే ధోరణిలో ఉన్నారని, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో డ్రైవర్లకు భోజనం కూడా దొరకడం లేదని కంపెనీలో క్యాంటీన్ పెట్టాలని ఒక రూల్ ఉన్నా కూడా పర్మిషన్ ఇవ్వడం లేదని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వస్తే రాత్రి 10 గంటలకైనా కూడా లోడింగ్ కాలేదని, సాయంత్రం 5.30 గంటలకు కంపెనీ మూతపడాలని ఇలాంటివి ఇక్కడ ఏమీ జరగడం లేదని తెలిపారు. 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.

రక్షణ కోసం వస్తే భార్యను దూరం చేశారు

- పోలీసుస్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు


దేవాలయంలో పెళ్లినాటి ఫొటో

మదనపల్లె అర్బన్, ఆగస్టు 22: ప్రేమ పెళ్లి చేసుకున్నామని, కుటుంబసభ్యులతో ప్రమాదం ఉందని పోలీసుస్టేషన్‌కు రక్షణ కోసం వస్తే పోలీసులు కౌన్సెలింగ్ పేరుతో నా భార్యను దూరం చేశారని ఓ యువకుడు గురువారం సాయంత్రం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. బాధిత యువకుడు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం రామాచార్లపల్లె గ్రామం గంగన్నగారిపల్లెకు చెందిన రమణ కుమారుడు సోముశేఖర్ (23), అదే మండలం తట్టివారిపల్లెకు చెందిన తమ సమీప బంధువైన భవ్యశ్రీ (19)ని 15 రోజుల క్రితం తంబళ్లపల్లె వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. తాము మేజర్లమని తమ కుటుంబసభ్యులతో సమస్య ఉందని రక్షణ కోసం అప్పటి సీఐ శేఖర్, ఎస్‌ఐ రవికుమార్‌లకు ఫిర్యాదు చేయగా ఆదేరోజు పోలీసులు కౌన్సెలింగ్ పేరుతో 5 గంటల పాటు నా భార్యను కొట్టి భయపెట్టి తిరుపతికి పంపించి వేశారని వాపోయాడు. పది రోజుల్లో మిమ్మల్ని కలుపుతామని అప్పట్లో పోలీసులు హామీ ఇచ్చారని కానీ అప్పటి నుంచి రోజూ మదనపల్లె తాలుకా స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని, పైగా అప్పుడు ఉన్న సీఐ, ఎస్‌ఐలు బదిలీపై వెళ్లారని కొత్తగా వచ్చిన వారు పట్టించుకోలేదని వాపోయాడు. ఇక చేసేది లేక నా భార్యను పిలిపించే వరకు ఇక్కడే పోలీసుస్టేషన్‌లోనే ఉంటా లేదంటే చచ్చిపోతానని పోలీసుల ఎదుటే తెగేసి చెప్పి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటుండగా వెంటనే అక్కడున్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. చివరకు పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించివేశారు.


తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న యువకుడు

పది రోజుల్లో ఇసుకను అందుబాటులోకి తెస్తాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాజంపేట టౌన్, ఆగస్టు 22: గృహ అవసరాల కోసం ఇసుకను పది రోజుల్లో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని బుడుగుంటపల్లె ఇసుక రీచ్ ద్వారా ఇసుకను అందుబాటులోకి తెస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఇసుక రీచ్ ద్వారా 5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించినట్లు తెలిపారు. ఇసుక పూర్తిగా మనుషుల ద్వారానే వాహనాలకు లోడింగ్ జరుగుతుందన్నారు. ప్రతి ట్రాక్టర్ లోడుకు 500 రూపాయలు కూలీ తీసుకుంటాన్నారు. అదనంగా జీఎస్టీ, రవాణా చార్జీలు ఉంటాయన్నారు. ఇసుక రవాణాలో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం ఉండదన్నారు. ఇసుకను సచివాలయం ద్వారానే బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. ఇసుక రవాణాలో ఎలాంటి తోపులాటలు, ఘర్షణలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇసుక అక్రమ రవాణా జరిగినా, ఎలాంటి సమస్యలు ఉన్నా 08561-293006 అనే టోల్ ఫ్రీకి సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

లాక్ కనిపిస్తే.. లూటీనే





తాళం వేసి ఇళ్లనే టార్గెట్ చేసుకుంటారు. పక్కాగా రెక్కీ నిర్వహించి.. ఆపై దర్జాగా తాళాలు పగలగొట్టి ఇళ్లలోని బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను దోచుకుపోతారు. ఇటీవల ఇలాంటి దొంగతనాలు కడప నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లా లంటే.. భయంతో వణికిపోతున్నారు.

- తాళం వేసిన ఇళ్లపైనే కన్ను
- వరుస దొంగతనాలతో భయాందోళనలో ప్రజలు
- పోలీసు గస్తీ అంతంత మాత్రమే

కడప (క్రైం), ఆగస్టు 22: కడప నగరంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత మూడు రోజుల నుంచి కొంత మంది యువకులు దొంగతనాలు చేస్తూ.. విజయదుర్గాకాలనీలో తిరుగుతుండగా సీసీ ఫుటేజీల్లో రికార్డు అయింది. రెండిళ్లలో చోరీకి యత్నించి విఫలమైనప్పటికీ మరో రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో కేజీ వెండితో పాటు బంగారు నగలు దోచుకెళ్లారు. అలాగే ఇటీవల రాజు మార్ట్ వద్ద ఒకేసారి మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం కడప రాజారెడ్డివీధిలో సాయంత్రం ఇంటి కరెంటు బిల్లు కట్టేందుకు వెళ్లి తిరిగి వచ్చేలోపు ఆ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు దోచుకెళ్లారు. అదే రోజు ఓంశాంతి నగర్‌లో ఓ ఇంట్లో దొంగలు పడి నల్లపూసల దండ అపహరించారు.

స్టైల్ మార్చి.. దొంగతనాలు

ప్రస్తుతం దొంగతనాల స్టైల్ మారింది. చాకచక్యంగా నిమిషాల్లో తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ దోచుకుపోతున్నారు. ఒకప్పుడు దొంగతనం చేసిన విధానాన్ని బట్టి ఫలానా బ్యాచ్ చేసి ఉండొచ్చని పోలీసులు అంచనా వేసి దొంగలను పట్టుకునే వారు. పోలీసులు నిఘా పెట్టినా.. సీసీ కెమెరాలు ఉన్నా దొంగలను గుర్తించడంలో పోలీసులు గుర్తించ లేని పరిస్థితి. కాగా, కొన్ని నెలల క్రితం కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఓ దొంగల ముఠా చెడ్డీ గ్యాంగ్‌లు ఆ ప్రాంతంలో తిరుగుతూ సీసీ ఫుటేజీలకు దొరికారు. వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారా లేక ఇక్కడ యువకులే అలా తయారై చోరీలకు పాల్పడుతున్నారా అనేది అర్థం కాని ప్రశ్న. ఏది ఏమైనా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు నిఘా కొరవడినట్లు తెలుస్తుంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

గత ప్రభుత్వ హయాంలో పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కాలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ కొరత ఉండడంతో ఉన్న సిబ్బందితోనే విధులు నెట్టుకొస్తున్నారు. కొందరు పోస్టింగులు ఒకచోట అయితే మరో చోట విధులు నిర్వహిస్తున్నారు. కేవలం బ్లూకోల్ట్స్ సిబ్బందితోనే గస్తీ నిర్వహి స్తున్నారు. కేవలం బ్లూకోల్ట్స్ సిబ్బందితోనే గస్తీ నిర్వహిస్తున్నారు. బాధితులు చోరీ ఘటనపై పోలీసుస్టేషన్‌లకు వెళితే సరైన స్పందన కనిపించడం లేదని, ఫిర్యాదు మేర కేసులు కట్టడం లేదని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల జమ్మలమడుగుకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు తన ఇంట్లో 30 తులాల బంగారు నగలు దొంగత నం జరిగితే పోలీసులు 20 తులాలకే కేసు కట్టారంటూ ఆ మహిళ ఎస్పీని ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

పనిచేయని సీసీ కెమెరాలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కమాండ్ అండ్ కంట్రోల్‌కు రూ.50లక్షలు విరాళం అందించారు. అలాగే దాతల సహకారంతో నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. అయితే నగర అభివృద్ధి పనుల పేరిట చాలా వరకు సీసీ కెమెరాలు తొలగించారు. దీంతో వాటిని మళ్లీ ఏర్పాటు చేయలేదు. దీంతో చోరీలో జరిగినా దొంగలను గుర్తించడంలో పోలీసులకు కష్టతరంగా మారింది. తొలగించిన కెమెరాలను పునరుద్ధరిస్తే దొంగలను గుర్తించేందుకు దోహదపడుతుంది.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన అంతంత మాత్రమే

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా దొంగలను నిమిషాల్లోనే పట్టుకునేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో ఈ యాప్ ద్వారా దొంగల ముఠాను అరెస్టు చేసి భారీ ఎత్తున రికవరీ చేశారు. అప్పట్లో ఎవరైనా ఊర్లకు వెళ్లేవారు ఈ ఎల్‌హెచ్ ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకునేవారు. ప్రస్తుతం దీనిపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ప్రజలు వినియోగించుకోలేకపోతున్నట్లు అర్థమవు తుంది. అలాగే విలువైన వస్తువులు ఇంట్లో పెట్టుకుని.. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఊర్లకు వెళుతుండడంతో దొంగలు ఆ ఇంట్లో దోచుకోవడం ఈజీగా మారుతోంది. ఎవరైనా ఊర్లకు వెళ్లాల్సి వస్తే సంబంధిత పోలీసులకు సమాచారం ఇస్తే ఆయా ఇళ్లపై పోలీసు నిఘా ఉంటుంది. తద్వారా దొంగతనాలను అరికట్టడానికి ఆస్కారం ఉంటుంది.



విజయదుర్గకాలనీలో సంచరిస్తున్న అనుమానితులు (ఫైల్)

కొరవడిన పోలీసుల నిఘా

కడప నగరంలో వరుస దంగతనాలు జరుగుతుండటంతో పోలీసుల నిఘా కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. కడపలో సీసీఎస్ పోలీసు స్టేషన్ ఉన్నప్పటికీ చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచలేకపోతున్నారు. సిబ్బంది కొరత, ఏళ్లతరబడి కొందరు సిబ్బంది ఇక్కడే కొనసాగుతుండటం.. వారు స్టేషన్‌లకే పరిమితమవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో దొంగతనం కేసుల్లో కీలక పాత్ర పోషించే సీసీఎస్ బృందం గత కొన్ని సంవత్సరాలుగా ఒక కేసు చేధించిన సందర్భం లేదు. ప్రస్తుతం సీసీఎస్ బృందాన్ని పెంచి దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ముమ్మరంగా గస్తీ చేపడుతున్నాం

దొంగతనాలను నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా పెట్టి.. గస్తీని ముమ్మరంగా చేపడుతున్నాం. ఎస్పీ కేటాయించిన స్పెషల్ టీంతో పాటు ప్రతిరోజు సీఐలు, ఎస్ఐలు ఐడీ పార్టీ సిబ్బందితో రాత్రి సమయంలో తనిఖీలు చేస్తున్నాం. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పూర్తి స్థాయిలో విచారిస్తున్నాం.

- భాస్కర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ

డిష్ కేబుల్ నెట్‌వర్క్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల కాదు : ఎస్ఈ



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ రమణ

కడప (నాగరాజుపేట), ఆగస్టు 22: కడప నగరంలోని బెల్లంమండీవీధిలో బుధవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందగా.. మరో బాలుడు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదం విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్ల జరగలేదని, డిష్ కేబుల్‌కు జతపరిచిన జీఏ వైరు వల్ల మాత్రమే జరిగిందని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ తెలిపారు. గురువారం విద్యుత్‌భవన్‌లో తన ఛాంబరులో విలేకరుల సమావేశం మాట్లాడుతూ.. చెట్టుపై నుంచి తెగిపడి వేలాడుతున్న డిష్ కేబుల్‌కు జత చేసిన జీఐ వైరు బాలురు సైకిల్‌పై వెళుతుండగా.. కాళ్లకు తగు లుకుని సైకిలు చక్రాలలో ఇరుక్కుపోయింది. అలాగే ముందుకు పోవడంతో విద్యుత్ ప్రవహిస్తున్న ట్రాన్స్‌ఫార్మరు వద్ద గల హెచ్‌డీ ఫ్యూజు సెట్ వద్ద 11 కేవీ లైనుకు తగలడంతో విద్యుత్ ప్రవాహం జరిగి ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి ముందు ఆ ప్రాంతంలో డిష్ వైరు తెగిపడి ఉందని, అక్కడి ప్రజలు తెలిపారన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి వీధుల్లో సంచరించే వేళ ప్రతి కేబుల్ వైరును చూసుకుంటూ జాగ్రత్తగా పోవాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి వేలాడుతుంటే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు వాట్సాప్ నెంబరు 9440814264కు తెలియజేయవచ్చన్నారు. ప్రజలు సొంతంగా విద్యుత్ మరమ్మత్తులు చేయకూడదన్నారు. ఏదైనా సమస్య ఉంటే విద్యుత్‌సిబ్బందికి సమస్య తెలిపితే.. సరిచేస్తారని తెలిపారు.

ఐదేళ్ల ఎంఎస్‌సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులైన వారు అర్హులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేడెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ పరిధిలోని ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంటు, రాయల్టీ ఇన్‌స్పెక్టరు జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఏపీ హెచ్‌ఆర్‌ఏసీ, ఏపీ ఎస్ఎండీసీ, ఏపీ గ్రౌండ్‌వాటర్ బోర్డు సంస్థల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22 నుంచి 24లోపు ఓఏ ఎండీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8985597928 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

వైవీయూలో పలు విభాగాలు తనిఖీ

వైవీయూలో గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి పలు విభాగాలను తనిఖీ చేశారు. హాస్టలు గదులను, వంట శాలలను పరిశీలించారు. అపరిశుభ్రతకు తావు ఇవ్వకూడదని అక్కడున్న సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రవేశాల సంచాలకుల కార్యాలయం సందర్శించి ఎంటీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసరు దాము, డీవోఏ డైరెక్టరు లక్ష్మీప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి



పీఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

రాయచోటిటౌన్, ఆగస్టు 22: దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన కలకత్తాలోని ఆర్జికార్ ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి నాగేంద్రబాబు, జిల్లా కన్వీనర్ వెంకట్రమణలు మాట్లాడుతూ ఘటన జరిగి పది రోజులు గడిచినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ ద్వారా త్వరితగతిన విచారణ జరిపించాలని, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నైతిక బాధ్యత వహించి తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై బాధ్యత వహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిజనిజాలను బయటికి రాకుండా తుంగలోకి తొక్కి.. నిందితులను కాపాడే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. జూనియర్ డాక్టర్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలబడి అన్ని విధాలుగా ఆదుకోవాలని, తక్షణమే నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీలు పాల్గొన్నారు.

హోంగార్డుపై దాడి చేసిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు

- నిర్లక్ష్యం వహించిన ఎస్ఐకి షోకాజ్ నోటీసు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పులివెందుల టౌన్, ఆగస్టు 22: పులివెందుల పట్టణంలో హోంగార్డుపై దాడి చేసిన సంఘటనలో రౌడీషీటర్ సాయి, అతని స్నేహితులపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై పోలీ సులు, హోంగార్డులచే ప్రతి రోజు పట్టణ శివార్లలో పహారా చేయిస్తు న్నామన్నారు. ఈక్రమంలో ఈనెల 19వ తేదీ రాత్రి పట్టణంలోని కదిరి రోడ్డులో కనికరం సాయి, అతని మిత్రులు మద్యం తాగుతుండగా హోంగార్డులు శివ మల్లేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు ప్రశ్నించినందుకు చేయిచేసుకున్నారు. బుధవారం సాయి, అతని మిత్రులపై నాన్ బెయిల బుల్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈసంఘటనపై కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐకి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా షోకాజ్ నోటీస్ ఇచ్చామని.. రైటర్ గోవిందును పనిష్‌మెంట్ కింద సింహాద్రిపురం స్టేషన్‌కు అను సంధానం చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

పెళ్లిలో ఘర్షణ.. కత్తితో దాడి ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్రిష్ణయ్య

కమలాపురం రూరల్, ఆగస్టు 22: పట్టణంలోని అప్పాయపల్లె సీఎస్ఐ చర్చి ప్రాంగణం లో గురువారం జరిగిన పెళ్లిలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో మద్యం మత్తులో క్రిష్ణయ్యను ఏసన్న అనే వ్యక్తి కత్తితో పొడవడంతో గాయాలయ్యాయి. కొండాపురం మండలం వి.అనంతపురం గ్రామానికి చెందిన ఏసన్న గడ్డం రాజు వివాహానికి వచ్చారు. ఏసన్న గడ్డంరాజు తండ్రిని మద్యం మత్తులో హేళనగా మాట్లాడడంతో వారిద్దరి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇంతలో అక్కడే ఉన్న క్రిష్ణయ్య కలగజేసుకుని ఘర్షణ పడవద్దని చెప్పగా మధ్యలో నీ పెత్తనం ఏందంటూ ఏసన్న క్రిష్ణయ్యపై కత్తితో దాడి చేయడంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు, బంధువులు క్రిష్ణయ్యను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

- బాధితులు ప్రొద్దుటూరు వాసులు

జలదంకి, ఆగస్టు 22: నెల్లూరు జిల్లా జలదంకి మండలంలోని 9వ మైలు చీకటివాగు వంతెన సమీపంలో హైవేపై గురువారం తెల్లవారుజామున కారు బోల్తా పడగా, అందులో ప్రయాణిస్తున్న కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన భార్యాభర్తలు టీ సుధాకర్, టీవిజయలక్ష్మిలకు గాయాలయ్యాయి. 9వమైలు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఓ వివాహానికి వీరు హాజరయ్యారు. తెల్లవారుజామున టీ తాగేందుకు కారులో జలదంకి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కారులో ఉన్న వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు వారిని పరామర్శించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



కడప (క్రైం), ఆగస్టు 22: కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా... ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.2 ఉన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9440900811, 9440627398 ఫోను చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి



సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 22: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని అనంతపురం గొల్లపల్లెలో శుభకార్యానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామీణ రోడ్లు, తాగునీరు, ఉపాధి హామీపథకంపై ప్రత్యే దృష్టి పెడుతున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో ఏర్పాటు చేస్తాం, ఇళ్లు లేని ప్రతి నిరుపేదకు పార్టీలకు అతీతంగా ఇంటి పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని తెలిపారు. అనంతరం ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. అలాగే లక్కిరెడ్డిపల్లెలో కస్తూర్బాగాంధీ విద్యాలయానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన మంత్రి వెంటనే రోడ్డు ఏర్పాటు చేసి పాఠశాలలోని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అంబేద్కర్ బాలికల గురుకల పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాదుబాబు, టీడీపీ నాయకులు పాపయ్య, డాక్టర్ షఫీ నాయక్, ఆరిఫుల్లా, చెల్లు శ్రీనివాసులు, శివ, రామాంజనేలు, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటిటౌన్, ఆగస్టు 22: పట్టణంలో ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు జరగబోయే సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు సంబంధించిన పోస్టర్లను గురువారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. మంత్రిని ఏపీ టార్గెట్‌బాల్ చాంపియన్ షిప్ ట్రెజరర్ చంద్రశేఖర్‌తో పాటు అన్నమయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నేతలు వీరాంజనేయులు, రెడ్డెయ్య, రేవంత్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి రాయచోటిలో జరగబోయే సౌత్‌జోన్ టార్గెట్‌బాల్ పురుషుల, మహిళల విభాగం పోటీల గురించి ఆయనకు వివరించారు.

హోంగార్డ్స్ పరేడ్ తనిఖీ

కడప (క్రైం), ఆగస్టు 22: జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో గురువారం హోంగార్డ్స్ కమాండెంట్ మహేశ్‌కుమార్ హోంగార్డ్స్ పరేడ్‌ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ హోంగార్డులు పలు ప్రభుత్వశాఖల్లో పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటున్నారన్నారు. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని.. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే సబ్‌డివిజన్ హోంగార్డు ఇన్‌చార్జ్‌లకు కానీ రిజర్వు ఇన్‌స్పెక్టరుకు కానీ తెలిపి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



పులివెందుల, ఆగస్టు 22: తొండూరు మండలంలోని మదూరు గ్రామానికి చెందిన ముక్కోటి శ్రీదేవి (53) అదృశ్యమైనట్లు తొండూరు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... ఈనెల 19వ తేదీ ఉదయం 9గంటలకు శ్రీదేవి ఇంటి నుంచి వెళ్లిపోయిందని.. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండేది కాదని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు తొండూరు ఎస్ఐ 9121100617, పులివెందుల రూరల్ సీఐ 9121100549 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ముగ్గురు మట్కాబీటర్లు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 22: పెన్నానగర్‌లోని వాటర్ పంప్ హౌస్ వద్ద ముగ్గురు మట్కా బీటర్లును అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వచ్చిన సమాచారంతో కొణిదెల దస్తగిరి, షేక్ హుస్సేన్ బాషా, షేక్ కమాల్‌బాషలు మట్కా పట్టీలు రాస్తుండగా తమ సిబ్బందితో కలిసి దాడిచేసి ముగ్గురుని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,02,000 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనం బోల్తా .. తప్పిన ప్రమాదం

నందలూరు, ఆగస్టు 22: కడప-చెన్నై, ప్రధాన జాతీయ రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం సమీపంలో గురువారం కడప నుంచి రాజంపేటకు వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఏమీ కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కడప (క్రైం), ఆగస్టు 22 : కడప నగరం బైపాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలసుబ్బరాయుడు అనే యువకుడు గాయపడినట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. సిద్దవటం మండలం వడ్డెవారిపల్లెకు చెందిన బాలసుబ్బరాయుడు సొంత పని నిమిత్తం కడపకు వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి కింద పడటంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పది ఇసుక ట్రాక్టర్లు సీజ్

వల్లూరు, ఆగస్టు 22 : మండల పరిధిలోని పాపఘ్నినది బ్రిడ్జి వద్ద నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు. గత కొన్ని రోజులుగా రాత్రి సమయాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న పది ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు..

పెండ్లిమర్రి, ఆగస్టు 22: పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి రవాణాపత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడి మృతి



కలకడ, ఆగస్టు 22: మండలంలోని కోన క్రాస్-కోన మార్గ మధ్యంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో తరుణ్ (24) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడప పట్టణానికి చెందిన తరుణ్ కోన గ్రామానికి చెందిన ఓ ఎక్స్‌కవేటర్ యజమాని వద్ద క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పని చేస్తున్న ప్రాంతం నుంచి బుధవారం చీకటి పడ్డాక సొంత పని మీద వెళ్లుతున్నాని చెప్పి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే రాత్రైయిన రాక పోవడంతో ఆచూకీ కోసం స్నేహితులు చుట్టు పక్కల వెతకగా గురువారం ఉదయం ఘటన స్థలంలో ముళ్లపొద్దలో పడి మృతి చెందినట్లు గుర్తించి సమాచారం ఇచ్చారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

12.5 టీఎంసీలు దాటిన గండికోట నీటిమట్టం

కొండాపురం, ఆగస్టు 22: గండికోట ప్రాజెక్టులో గురువారం సాయంత్రానికి 12.5 నీటిమట్టం దాటినట్లు డీఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 11,000 క్యూసెక్కులు ఉన్నట్లు డీఈ తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి వామికొండ, సర్వరాయసాగర్‌కు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 10న అవుకు రిజర్వాయిర్ నుంచి నీటిని విడుదల చేయగా.. ఇప్పటివరకు 11 టీయంసీలకు పైగా నీరు గండికోట ప్రాజెక్టులోకి వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పుస్తకాలు పంపిణీ

రాయచోటిటౌన్, ఆగస్టు 22: పట్టణంలోని బేతల్‌కాలనీ పాఠశాలలో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 110 మంది పిల్లలకు డ్రాయింగ్ పుస్తకాలు, క్రయాన్స్ అందజేశారు. మునగా నవీన్‌కుమార్ ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. రోటరీక్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



కేకు కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అభిమానులు

రాజంపేటటౌన్, ఆగస్టు 22: రాజంపేట పట్టణంలోని గీతాంజలి కళాశాలలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట జనసేన నాయకుడు అతికారి కృష్ణ, అతికారి దినేశ్‌లు హాజరయ్యారు. టీడీపీ నేత గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ ఆధ్వర్యంలో చిరంజీవి అభిమానులు, కూటమి నేతల మధ్యలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరంజీవి కష్టజీవి అని, స్వయంకృషితో సినీ ఇండస్ట్రీలో అందనంత ఎత్తుకు ఎదిగారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున చిరంజీవి అభిమానులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



తిరుమలకు పాదయాత్ర చేస్తున్న శివారెడ్డితో మంత్రి

రాయచోటిటౌన్, ఆగస్టు 22: తన అభిమాని కసిరెడ్డి శివారెడ్డి గాలివీడు మండలం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తుండడంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కలిసి పరామర్శించారు. గురువారం సాయంత్రం రంగంపేట సమీపంలో పాదయాత్ర జరుగుతుండగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను గెలవాలని మొక్కుకుని తిరుమలకు పాదయాత్ర చేయడం గొప్పవిషయమన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కుటుంబ సభ్యులందరూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు.

మంత్రిని కలిసిన రూరల్ సీఐ

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గురువారం రాయచోటి పట్టణంలోని పీసీఆర్ గ్రాండ్ హోటల్‌లో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

గాలివీడు: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నూలివీడు పంచాయతీలోని వడ్లపల్లికి చెందిన శ్రీనివాసులరెడ్డి వివాహ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షరీద్‌బాషా, మహమ్మద్ రియాజ్, శ్రీనివాస్ రాజు, జగన్నాథరెడ్డి, రైతు సంఘం కార్యదర్శి వెంకటశివారెడ్డి, బ్యాంకు శ్రీను పాల్గొన్నారు.

ఆడపిల్లలను బాగా చదివించాలి : సీడీపీఓ

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 22: ఆడపిల్లలను చులకనగా చూడకుండా బాగా చదివించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. గురువారం కోనంపేట అంగన్‌వాడీ కేంద్రంలో బేటీపడావో, బేటీబచావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. గర్భం దాల్చిన వెంటనే పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రతిరోజు ఆకుకూరలు, పప్పుదినుసులు, పాలు, గుడ్లు, అందించాలన్నారు. ఆడపిల్లలకు చిన్న వయస్సులోనే బాల్యవివాహాలు చేయకుండా బాగా చదివించాలని సూచించారు. వారికోసం కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హైమావతి, దాద్‌బీ, తులశమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.

రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత

రామాపురం, ఆగస్టు 22: మండలంలోని సుద్దమళ్ల గ్రామం ఎగువ హరిజనవాడకు చెందిన బుచ్చినపల్లి గోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతను ఏపీజీబీలో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.20 తమ అకౌంట్ నుంచి బీమాకు జమ అయిన కారణంగా మృతుడి భార్య సుజాతకు రూ.2 లక్షల చెక్కును అందజేసినట్లు ఏపీజీబీ మేనేజర్ ఇంతియాజ్ అన్నారు. ఏడాదికి రూ.20 చెల్లిస్తే ఈ బీమా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

రాజంపేట, ఆగస్టు 22: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులోని రోగులను పరిశీలించారు. అందులో గాయపడిన టీడీపీ కార్యకర్త రామారావు పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీఎన్ రాజుతో కలిసి ఆసుపత్రిలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మాధవరెడ్డి, అనిల్‌కుమార్, టీడీపీ నేతలు వెంకటనరసయ్య, సుబ్రమణ్యంనాయుడు, మహేష్‌రాజు, సతీష్‌రాజు, నాగేశ్వరనాయుడు, శేషారెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

● తహసీల్దార్ మురాషావల్లి

సిద్దవటం, ఆగస్టు 22: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మురాషావల్లి పేర్కొన్నారు. మండలంలోని కడప-చెన్నై రహదారి కనుమలోపల్లి రెవెన్యూ పెద్దపల్లి గ్రామ పంచాయతీ సర్వే నంబరు 70లో 4 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనట్లు అధికారులకు ఫిర్యాదులందాయి. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దారు మురాషావలి కబ్జా చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేనంబరు 70లోని తన స్థలాన్ని గుర్తుతెలియని వారు ఆక్రమించారని బుజ్జమ్మ అనే మహిళ కలెక్టరుకు ఫిర్యాదు చేసిందని, ఆ మేరకు తాము సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. ఇరువురిని విచారించి శుక్రవారం పై అధికారులకు తుది నివేదిక ఇస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

రామాపురం, ఆగస్టు 22: మండలంలోని సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన కిరణ్‌కుమార్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, టీడీపీ నాయకులు గురువారం హైదరాబాద్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించారు. అనంతరం హాస్పిటల్ ఖర్చులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు : పీడీ

రామాపురం, ఆగస్టు 22: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే బ్యాంకులకు మంచి గుర్తింపు లభిస్తుందని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రమైన రామాపురంలో ఆర్ఎం లక్ష్మితులసి ఆధ్వర్యంలో నూతనంగా యూనియన్ బ్యాంక్ ప్రారంభించారు.ఇందుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.

విగ్రహ ప్రతిష్ఠలో టీడీపీ నాయకులు

పెనగలూరు, ఆగస్టు 22: మండలంలోని పొందలూరు హరిజనవాడలో గురువారం జరిగిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ముక్కా వరలక్ష్మీలు పాల్గొన్నారు. వీరివెంట టీడీపీ, జనసేన, స్థానిక ఇతర మండలాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ యూత్ సభ్యులు వారికి ఘనస్వాగతం పలికారు.

'రూ.కోటి పరిహారం ఇవ్వాలి'

రైల్వేకోడూరు, ఆగస్టు 22: ఫార్మా మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా నాయకులు వెంకటేష్‌లు తెలిపారు. గురువారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.



డంపింగ్ యార్డులో మంటలు

రైల్వేకోడూరు, ఆగస్టు 22: పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డులో గురువారం మంటలు చెలరేగడంతో పొగలు కమ్ముకున్నాయి. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో స్పందించిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు.

విద్యార్థి మృతికి సుగవాసి దిగ్భ్రాంతి

రాజంపేటటౌన్, ఆగస్టు 22: కడప పట్టణంలో ఇద్దరు విద్యార్థులు సైకిల్‌పై వెళ్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

జన్మదినాన శ్రీవారి సన్నిధిలో




మెగాస్టార్ చిరంజీవి తన పుట్టినరోజు సందర్భంగా గురువారం కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేకువజామున సంప్రదాయ వస్త్రధారణతో సుప్రభాత సేవలో పాల్గొన్నారు.ఆలయం లోపల, బయట పలువురు యాత్రికులు చిరంజీవిని చూసి సంబరపడ్డారు. సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు పాఠశాలల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 22: చంద్రయాన్-3 విజయాన్ని గుర్తు చేస్తూ ఆగస్టు 23వ తేదీని భారత ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినంగా ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శుక్రవారం వేడుకలు నిర్వహించనున్నారు. అంతరిక్షానికి సంబంధించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా క్విజ్, చంద్రయాన్ నమూనా తయారీ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.



చంద్రయాన్-3 రాకెట్

● నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం

54 ఏళ్ల కిందట బుడిబుడి అడుగులతో ప్రారంభమైన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రయాణం నేడు అంతర్జాతీయస్థాయిలో ప్రశంసలందుకునే స్థాయికి ఎదిగింది.ఇస్రో ప్రయోగించే రాకెట్ల నుంచి ఉపగ్రహాలను పంపేందుకు ఎన్నో దేశాలు క్యూ కడుతున్నాయి.1969లో తుంబా నుంచి చిన్నచిన్న సౌండింగ్ రాకెట్లతో ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఇస్రో తొలి ఉపగ్రహం ఆర్యభట్ట ప్రయోగంతో నిర్ణయాత్మక దశకు చేరింది.అక్కడినుంచి చంద్రయాన్-3 ప్రయోగ విజయం వరకూ ఎన్నో మార్లు దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పింది.ఇస్రో చరిత్రలో గొప్ప మైలురాయి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడమే కాకుండా గత ఏడాది ఆగస్టు 23న చంద్రయాన్-3లో పంపిన ప్రజ్ఞాన్, రోవర్ చంద్రుడిపై సేఫ్‌గా ల్యాండ్ కావడంతో దేశంలో సంబరాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆ రోజును భారత ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించింది.ఈ ఏడాది ఇస్రో, భారత ప్రభుత్వం, షార్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అంతరిక్ష దినోత్సవాలను నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు.శుక్రవారం న్యూఢిల్లీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు.

షార్ ఎదిగిందిలా....

ఇస్రో విజయాల్లో శ్రీహరికోటలోని షార్‌కు ప్రముఖ పాత్రే వుంది. 1969లో శ్రీహరికోటను రాకెట్ కేంద్రంగా ప్రకటించారు 1971లో రోహిణి -125 సౌండింగ్ రాకెట్ ప్రయోగాత్మక పరీక్షలు జరపడంతో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 1969-79 మధ్యలో కాలంలో ఇక్కడ నుంచి ప్రయోగాలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నారు.తొలిసారిగా 1979 ఆగస్టు 10న ఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం చేపట్టారు. 1987లో ఏఎస్ఎల్వీ, చిన్న ఉపగ్రహాలను పంపారు. 1993 సెప్టెంబరు 20న పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఇస్రో ఇక్కడినుంచే శ్రీకారం చుట్టింది.వరుస విజయాలను అందుకొని చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-1 కూడా పీఎస్ఎల్వీ వాహక నౌక ద్వారానే ప్రయోగించడం విశేషం. అధిక బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు 2001లో జీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. అనంతరం 2014లో జీఎస్ఎల్వీ-మార్క్ 3 ప్రయోగం చేపట్టింది. మళ్లీ ప్రయోగ ఖర్చును తగ్గించేందుకు 2022 ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలకు శ్రీకారం చుట్టి వాణిజ్యపరంగా దూసుకెంది. ఇస్రో ఇప్పటికి ఆరు రకాల వాహక నౌకలు రూపొందించి 97 ప్రయోగాలు చేపట్టింది. చిన్న ప్రయోగాల నుంచి చంద్రయాన్-1, మంగళయాన్, ఆదిత్య-ఎల్ 1 వంటి భారీ ప్రయోగాలను విజయవం తంగా చేపట్టింది.చంద్రయాన్-2 చివరి నిమిషంలో విఫలమైనా చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. భవిష్యత్‌లో గగన్‌యాన్ ద్వారా మానవుడిని అంతరిక్షంలోకి పంపడమే ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన పలు పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తోంది.

- సూళ్లూరుపేట



సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు

తిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.4.12 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు హుండీలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది.

25న అండర్-14 క్రికెట్ సెలెక్షన్స్

పలమనేరు, ఆగస్టు22 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 25వ తేదీ అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని స్థానిక క్రికెట్ కోచ్ బాలాజి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు బి.విజయకుమార్ ఆదేశాల మేరకు 25వ తేదీ ఉదయం 10 గంటలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, చౌడేపల్లి మండలాలకు చెందిన క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపికను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. క్రీడా కారులు తమ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, కిట్, తెల్లటిదుస్తులు ధరించి రావాలన్నారు. ఇతర వివరాలకు బాలాజి 7675843101, చిరంజీవి 9704023203 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

స్వర్ణ రథంపై ఊరేగిన వరసిద్ధుడు



ఆస్థాన మండపానికి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 22: కాణిపాకంలో గురువారం సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపంలో కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతం నిర్వహించారు. ఈ వ్రతాన్ని ఆచరిస్తే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. రాత్రి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి మాడ వీధులలో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈవో వాణి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, విష్ణేష్ పాల్గొన్నారు.



స్వర్ణరథంపై కొలువుదీరిన స్వామి వారు

తల్లి తిట్టిందని కూతురు ఆత్మహత్య

చిత్తూరు, ఆగస్టు 22: తల్లి తిట్టిందనే కోపంతో కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్ఐ ప్రసాద్ వివరాల మేరకు... ఓబనపల్లెకు చెందిన రజియాకు ఇద్దరు కుమార్తెలు. ఇంట్లో పనులు చేయమంటే ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఘర్షణ పడేవారు. గురువారం ఇదే విషయమై పాతిమా(24) చెల్లితో గొడవపడింది. తల్లి ఇద్దరు కుమార్తెలను మందలించింది. అనంతరం ఆమె కూరగాయలు తీసుకురావడానికి బయటకు వెళ్లింది. చెల్లి కూడా వీధిలోకి వెళ్లిపోయింది. పాతిమా ఇంటి తలుపును మూసేసింది. నమాజు చేసుకోవడానికి మూసిందని అనుకున్నారు. ఎంత సేపటికీ తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపును పగులగొట్టి లోపల చూసేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపాలిటీ వారి హెచ్చరిక

● అక్రమ లే అవుట్లలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతించమంటూ బోర్డుల ఏర్పాటు

పలమనేరు, ఆగస్టు 22: 'అక్రమ లే అవుట్లలో క్రయ విక్రయాలు నేరం. వీటిల్లో ఎటువంటి నిర్మాణాలకు అనుమతించం' అంటూ పలమనేరు మున్సిపాలిటీలోని అక్రమ లేఅవుట్లలో గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సిబ్బందితో కలిసి కమిషనరు రమణారెడ్డి వీటిని ఏర్పాటు చేయించారు. అక్రమ లే అవుట్లు వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లపై చర్యలకు ఉపక్రమించింది. పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో గత వైసీసీ ప్రభుత్వ హయాంలో పుట్టగొడుగుల్లా రియల్టర్లు అక్రమ లే అవుట్లు వేసి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ భూములు, ఎస్సీలకు కేటాయించిన అసైన్డు భూములనూ తమ లే అవుట్లలో కలిపేసి అమ్మేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పలమనేరులో మున్సిపల్ అధికారులు వీటిపై విచారించారు. కేవలం మూడు లేఅవుట్లు మాత్రమే అప్రూవ్ అయినట్లు గుర్తించారు. ఇందులో శ్రీనాథ్‌లే అవుట్ 2009లోను, జేఎస్ నగర్ లే అవుట్ 2004లోను, రమాగార్డెన్స్ లే అవుట్ 2014లోను అప్రూవ్ అయ్యాయని అధికారులు తెలిపారు. ఇక 36 లే అవుట్లు అక్రమంగా వెలిసినట్లు గుర్తించారు. వీటిలోని 53.98 ఎకరాల మేర రియల్టర్లు నివేశస్థలాలుగా వేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొన్ని లే అవుట్లలో 50 నుంచి 70 శాతం పైగా నివేశస్థలాలను విక్రయించేశారు. ఇలా కొన్న వారిలోనూ కొందరు ప్లాట్లను అమ్మేసినట్లు అధికారులు గుర్తించారు. అంటే.. కొన్ని ప్లాట్లు ముగ్గురు, నలుగురు చేతులు మారాయన్న మాట.



అక్రమ లే అవుట్లలో ఇళ్లు కట్టుకోవాలంటే..

ఇలా అక్రమ లే అవుట్లలో నివేశస్థలాలు కొని ఎవరైనా తప్పనిసరి పరిస్థితిలో ఇల్లు నిర్మించుకోవాలంటే వారు మున్సిపాలిటీకి స్థలం కొనుగోలు ధరలో (ఇప్పుడున్న ధర మేరకు) బెటర్మెంట్‌ఛార్జీ కింద 14.5 శాతం మేరకు కట్టాలి. వీటికి తోడు మున్సిపాలిటీ నిబంధనల మేరకు లే అవుట్లలో కనీసం లోపలి రోడ్డు 35 అడుగుల వెడల్పు ఉండాలి. దీంతో అక్రమ లే అవుట్లలో కేవలం 20 అడుగుల మేర రోడ్డు వుంటే మిగిలిన 15 అడుగులు నివేశస్థలం కొనుగోలుదారు తమ స్థలం వదిలి మిగిలిన స్థలంలో నిబంధనలమేరకు ఇల్లు నిర్మించుకోవాలి. ఇక ఉద్యోగులు అయితే అక్రమ లే అవుట్‌లో కొన్న నివేశస్థలంలో ఇళ్లు నిర్మించు కొనేందుకు బ్యాంకులవద్దకు వెళ్తే వారికి రుణం దొరకడం కూడా కష్టమే. అందువల్ల ప్రభుత్వం, అధికారులు అక్రమ లే అవుట్లలో నివేశస్థలాలు కొనవద్దని ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఆ మేరకు బోర్డులు ఏర్పాటు చేశారు.

రూ.50 లక్షల లిక్విడ్ గంజాయి స్వాధీనం

కారు సీజ్- పరారైన ముగ్గురు నిందితుల కోసం గాలింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: తిరుపతిలో పోలీసులు దాదాపు 50 లక్షల విలువ చేసే లిక్విడ్ గంజాయిని గురువారం మధ్యాహ్నం ఓ కారుతోపాటు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ సీఐ సాధిక్ ఆలి తెలిపిన వివరాల మేరకు.. కేఎల్71-డీ 3686 నెంబరుతో ఉన్న కారులో లిక్విడ్ గంజాయి భారీ ఎత్తున తీసుకెళుతున్నారని పోలీసులకు ముందస్తు సమాచారం అందిం ది. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో రూరల్ సీఐతోపాటు ఎస్ఐలు షేక్ షావలి, నాగేంద్రబాబు తమ సిబ్బందితో కలసి నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చిత్తూరు వైపు వెళుతున్న ఈ కారులోని వారు పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించడంలో కారును రామానుజపల్లె సర్కిల్ వద్ద వదిలి, అందులోని ముగ్గురు పరారయ్యారు. కారును పరిశీలించగా డిక్కీ, డ్రైవర్ సీటు వెనుక లిక్విడ్ గంజాయి మూటలు బయటపడ్డాయి. వీటి విలువ సుమారుగా రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారైన ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాఘవ, తదితరులు పాల్గొన్నారు.



లిక్విడ్ గంజాయిని మీడియాకు చూపుతున్న సీఐ సాధిక్ ఆలి

పాఠశాలలో అగ్నిప్రమాదం

పాత ఫర్నిచర్ దగ్ధం, రూ.లక్ష ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: ఓ పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. పాత ఫర్నిచర్ దగ్ధమైంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేయడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బైరాగిపట్టెడలోని సోక్రటీస్ పాఠశాలలో గురువారం ఉదయం తరగతులు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా భవనం నాల్గవ అంతస్తు నుంచి మంటలు ఎగసి పడ్డాయి. ఉపాధ్యాయులు, సిబ్బంది భవనంపైకి వెళ్లి చూడగా.. అక్కడున్న గదిలో వాటర్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన మోటారు వైర్లలో షార్టుసర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. అక్కడున్న పాత ఫర్నిచర్, చిత్తు కాగితాలకు మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. అప్పటికే విద్యార్థులను పాఠశాల తరగతి గదుల నుంచి బయటకు పంపేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులూ పాఠశాల వద్దకు చేరుకున్నారు. పిల్లలు సురక్షితంగా ఉండటంతో ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. కాగా, పాఠశాలలో ఫైర్ ఫైటింగ్ పరికరాలు లేకపోవడంపై అగ్నిమాపక సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు.




పోలీస్‌స్టేషన్‌లో కొట్టుకుంటుండగా అడ్డుకుంటున్న పోలీసులు

పోలీసుల ఎదుటే డిష్యుం.. డిష్యుం

కొందరికి గాయాలు

పాత కక్షలతో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: పోలీసుల ఎదుటే రెండు కుటుంబాలకు చెందిన 15 మంది కొట్టుకున్నారు. కొందరు గాయపడ్డారు. తిరుపతి రూరల్ సర్కిల్ స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తిరుపతి రూరల్ పరిధిలోని కాలూరుకు చెందిన గోపి అతని కుమారుడు వెంకటకిరణ్, పక్కింటిలో కాపురముంటూ గ్యాస్ సరఫరా చేస్తున్న జానకిరాం మధ్య పాత కక్షలున్నాయి. కొద్ది రోజులుగా వీరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన జానకిరాంను మరో వర్గానికి చెందిన వారు స్టేషన్ ఎదుటే దుర్భాషలాడారు. మాటామాటా పెరిగి స్టేషన్ వద్ద ఎస్ఐ షేక్ షావలి, సిబ్బంది ఎదుట కొట్టుకోవడం మొదలు పెట్టారు. అక్కడున్న పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా మహిళలు, పురుషులూ కొట్లాటకు దిగారు. ఓ మహిళ కిందపడ్డారు. కొందరు గాయపడ్డారు. మహిళలపై ఎస్ఐ ఎదుటే దౌర్జన్యానికి దిగిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారిస్తున్నామని ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

వరదయ్యపాళెం ఏఎస్ఐ సస్పెన్షన్

వరదయ్యపాళెం, ఆగస్టు 22: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం సస్పెండ్ చేశారు.వరదయ్యపాళెంలో గత ఆదివారం రాత్రి 10.45గంటలకు ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరు యువకులు గొడవ పడ్డారు.వారిలో ఒకరు రాత్రి 11గంటల సమయంలో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి రాగా సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఈ విషయాన్ని స్టేషన్ ఇన్‌ఛార్జిగా ఉన్న ఏఎస్ఐ షణ్ముగానికి ఫోన్ ద్వారా తెలియజేశాడు.మరుసటి రోజు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పాడు.సోమవారం సాయంత్రం కేసు నమోదు చేశారు.అయితే కేసు నమోదు విషయంలో షణ్ముగం నిర్లక్ష్యం చూపాడంటూ ఎస్పీ సుబ్బరాయుడికి బాధితులు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించి విచారణ జరపకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించాడం, పై అధికారులకు తెలియజేయకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమనే కారణాలతో ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరిపైన అయినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ ముగ్గురికి గాయాలు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 22 : రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన పీటీఎం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు అందించిన సమాచారం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం బురేనా జిల్లాకు చెందిన డ్రైవర్ రాఘవేంద్ర(24), క్లీనర్ గరంబీర్(22) ఆర్‌జే 11జీబీ 2423 నంబర్ కలిగిన లారీ కర్నాటక రాష్ట్రంలోని ఎగువకోట సమీపంలోని నీలప్పల్లిలో బుధవారం ఓ రైతు వద్ద నుంచి గుమ్మడి కాయలు కొనుగోలు చేసి లారీకి నింపుకుని ఢిల్లీకి వెళ్లే క్రమంలో అక్కడి నుంచి బి.కొత్తకోట మీదుగా బయలేదేరి పీటీఎం సమీపంలోని బూర్లపల్లె క్రాస్ సమీపంలోకి రాగానే ములకలచెరువు నుంచి కర్నాటక రాష్టానికి చెందిన కేఏ11 బి 0637 టమోట లోడుతో కోలార్‌కు వెళ్లే క్రమంలో రెండు లారీలు వేగంగా ఢీకొన్నాయి. దీంతో లారీల ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందించడంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరు కుని లారీల్లో ఇరుక్కు పోయిన వారిని బయటకు తీశారు. రెండు లారీల్లో ఉన్న ముగ్గురికి గాయాలవడంతో 108వాహనం ద్వారా బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన డ్రైవర్ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాఘవేంద్ర (24), టమోటా లారీ డ్రైవర్ ప్రభాకర్, క్లీనర్ వెంకటేష్‌గా గుర్తించారు. కాగా మధ్యప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ రాఘవేంద్రకు రెండు కాళ్లు పూర్తిగా నలిగిపోయినట్లు గుర్తించిన డాక్టర్లు అతనిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. టమోటా లారీ డ్రైవర్ ప్రభాకర్‌ను బి.కొత్తకోట ఆసుపత్రి నుంచి మదనపల్లెకు రెఫర్ చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన క్లీనర్ గరంబీర్, టమోటా లారీ క్లీనర్ వెంకటేష్‌కు స్వల్పగాయాలతో మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంపై పీటీఎం పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పీటీఎం ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

కాలువలకు సాగునీరెప్పుడో..?

● కాంగ్రెస్, వైసీపీల నిర్లక్ష్యం ● పదేళ్లుగా బాధిత రైతుల నిరీక్షణ ● ఆకుమానిగుట్ట ప్రాజెక్టు భూపరిహారం చెల్లింపు అంతేనా..?


కోటకాడపల్లి సమీపంలోని ఆకుమానుగుట్ట మినీ ప్రాజెక్టు(కొత్తచెరువు)


పిచ్చి మొక్కలు, కంపచెట్లతో పేరుకుపోయిన కాలువలు

పెద్దమండ్యం, ఆగస్టు22: కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిన ఆకుమానిగుట్ట మినీ ప్రాజెక్టు (కొత్తచెరువు) సాగునీరు ఎప్పుడిస్తారో? అంటూ ఆయకట్టు రైతులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. భూపరిహారం బాధిత రైతులకు శాపంగా మారింది. ఏకంగా పదేళ్లగా భూపరిహారం కోసం గత ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో బాధితులు నిరుత్సాహస్థితిలో ఉండిపోయారు. త్వరగా భూపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆకుమానిగుట్ట ప్రాజెక్టు నిర్మాణం కోసం

పెద్దమండ్యం మండలం కోటకాడపల్లి గ్రామ పరిధిలో అకుమానిగుట్ట ప్రాజెక్టు నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి రూ343,30కోట్లు నిధులు మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణానికి 250 ఎకరాలు భూమిని సేకరించారు. 12 వందల ఎకరాల సాగునీరు అందించడం లక్ష్యంగా సుమారు 150 మంది రైతుల నుంచి భూములు సేకరించారు. ప్రాజెక్టు కట్ట, కుడి కాలువ 3 కిలో మీటర్లు, ఎడమ కాలువ 3 కిలో మీటర్లు అంచనా తో సంబంధిత అధికారులు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు ముంపు గ్రామం గా బుసిరెడ్డిగారిపల్లిని గుర్తించి 2005 మే 5వ తేదీన అప్పటి సీఎం భూమిపూజ నిర్వహించారు. అకుమానిగుట్ట మినీ ప్రాజెక్టు (కొత్త చెరువు) నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు అధికారుల నివేదికతో కాంగ్రెస్ హయాంలోనే 2009 జనవరి 23వ తేదీన ప్రారంభించారు.

భూపరిహారం చెల్లింపుల్లో అన్యాయం చేశారు

అకుమానిగుట్ట ప్రాజెక్టు అభివృద్ధితో తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతోందని ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వాలు భూపరిహారం చెల్లింపులు పూర్తి చేయకపోవడంతో రైతులకు అన్యాయం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యేలోపు రైతులందరికీ భూపరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామన్న హామీని విస్మరించారు. దీంతో ఆకుమానిగుట్ట ప్రాజెక్టు జలాలతో 1200 ఎకరాలు ఆయకట్టు సాగునీరుతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్న రైతన్న ఆశలు ఆవిరయ్యాయి. కుడి, ఎడమ కాలువల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు, అడవి చెట్లు మొలచి కాలువల్లో భూములకు సాగునీరు సాగడం కష్టంగా మారింది. ప్రాజెక్టు మూడుసార్లు వర్షపు నీటితో నిండినా ప్రాజెక్టు ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయి కానీ కాలువల సాగునీరు ద్వారా భూముల్లో పంటలు పండించడం రైతులకు కళగానే మిగిలింది.

మా గోడు ఎవరూ పట్టించుకోలేదు

భూపరిహారం కోసం పదేళ్లగా ఎదురు చూస్తున్నాం. అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా మా గోడు చెప్పినా ఎవరు పట్టించుకోలేదు. ప్రాజెక్టు నిర్మాణం, అభివృద్ధి పనులకు భూములు ఇచ్చాం. భూపరిహారం చెల్లించంచమని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి చెప్పులు అరిగిపోయాయి కానీ భూపరిహారం మాత్రం అందలేదు.. గత ప్రభుత్వాలు భూపరిహారం ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేశాయి. కొత్త ప్రభత్వం చర్యలు తీసుకొని బాధిత రైతులకు న్యాయం చేయాలి.

- బాధిత రైతు. రెడ్డప్పరెడ్డి, బండకాడపల్లి

భూపరిహారం కోసం నివేదికలు పంపాం

అకుమానిగుట్ట ప్రాజెక్టు (కొత్తచెరువు) బాధిత రైతుల భూపరిహారం చెల్లింపులకు రూ..2 కోట్ల 30 లక్షలు నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. గత ప్రభుత్వాలకు నివేదిక పంపినా 15 రోజుల క్రితం కొత్త ప్రభుత్వానికి భూపరిహారం కోసం నివేదిక ఇచ్చాం. సుమారు 60 ఎకరాలకు గాను 58 మంది బాధిత రైతులకు భూపరిహారం చెల్లింపులు జరగాల్సి ఉంది. ప్రాజెక్టు కాలువలు కట్టడాలు, క్లీనింగ్ కోసం రూ. 36 లక్షల మంజూరుకు ప్రతిపాదన పంపాం. అప్పట్లో ప్రాజెక్టు నిర్మాణం సమయంలో నేను విధుల్లో లేను.

-శ్రీనివాసులురెడ్డి, ఇరిగేషన్ ఏఈ. పెద్దమండ్యం

అక్రమ కేసులు బనాయించిన వారిపై చర్యలు తీసుకోండి

● కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌కు టీడీపీ నేతల వినతి


కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 22: వైసీపీ పాలనలో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించిన పోలీసు అధికారులపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్‌ను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు విన్నవించారు. గురువారం కర్నూల్‌లో డీఐజీ కార్యాలయంలో టీడీపీ నాయకులు డీఐజీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ గతేడాది అంగళ్లు ఘటనలో అప్పటి మాజీ సీఎం చంద్రబాబు పర్యటనలో ఆయనపైనే వైసీపీ నాయకులు దాడి చేసినా, పోలీసు అధికారులు పట్టించుకోకుండా ఏకంగా చంద్రబాబుతో సహా 96 మందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. దీంతో టీడీపీ నాయకులు అరణ్యవాసం చేయాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. చిత్తూరు జిల్లాలో చంద్రబాబును పర్యటించకుండా చేయాలని వైసీపీ నాయకులు దాడి చేశారని గుర్తుచేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారే కాని ఈ దాడిని అడ్డుకోలేదన్నారు. అప్పట్లో అధికారంలో వున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల కుట్రతోనే తమపై అక్రమ కేసులు బనాయించారని, వారందరిపై విచారించి చర్యలు తీసుకోవాలని డీఐజీని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు పాల్గొన్నారు.

ఇఫ్కోనానో ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు


ఎరువులను అందజేస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, ఆగస్టు 22: రైతులు పంట పొలాల్లో ఇఫ్కోనానో ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏపీ రీజనల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో సీఈవో హరినాధరెడ్డి, ఉమ్మడి జిల్లా మేనేజర్ దిలీప్‌లతో కలసి ఇఫ్కో నానో యూరియా, డిఏపీల విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1967లో సహకార సంఘాల ద్వారా ఇఫ్కో ఎరువులను తయారు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఇఫ్కోనానో యూరియాను లిక్విడ్ రూపంలో రైతులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఒక బస్తా ఎరువుకు నానో లిక్విడ్ ద్రావణం అర కిలో సరిపోతుందన్నారు. ఇదిలా ఉండగా పంట పొల్లాలో పిచికారి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 15 లక్షల డ్రోన్‌లను రైతుల కొరకు అందుబాటులో ఉంచిందన్నారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలోని రైతు శ్రీనావాసులు వరి పొలంలో డ్రోన్ ద్వారా పిచికారి చేసే విదానాన్ని డెమో రూపంలో వివరించారు. డ్రోన్ ద్వారా ఒక ఎకరాకు కేవలం 7నిమిషాల సమయం మాత్రమే పడుతుందని డ్రోన్‌ల ద్వారా పిచికారి చేసుకోవాలంటే రైతులు ముందుగానే వారి పేర్లను సహకార సంఘంలో నమోదు చేసుకొని కేవలం ఎకరాకు రూ.300 చెల్లించి పిచికారి చేసుకోవచ్చన్నారు. రైతుల కొరకు స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, పనిముట్లు వంటివి సబ్సిడీ ధరలకే ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ మహిళలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 22: మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం మండలం గుంతయంబాడి గ్రామంలో ఎస్సీ మహిళలపై దాడి చేసిన అగ్రకులాల యువకులను వెంటనే అరెస్టు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌత మ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18న రామసముద్రం మండలంలోని గుంతయంబాడి గ్రామ సమీపంలో కొందరు ఎస్సీ యువకులు వాలీబాల్ ఆడుతుండగా పక్కగ్రామం ఏటవాకిలీకి చెందిన వెంకటరమణ, అమరనాధరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, అమృత్, శివానందలు బైకులపై గ్రామంలో చొరబడి తీవ్రంగా కొట్టారన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహి స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు వెంకటరమణ అంజప్ప, చంద్రకళ, శివికుమార్, బీఎస్పీ నాయకులు రమణ, సురేష్, కృష్ణ బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, ప్రసా ద్, శివ, అరుష్, తదిరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



రామసముద్రం, ఆగస్టు 22: మండలంలోని కుదురుచీమనపల్లె పంచాయతీ, గుం తయంబాడి గ్రామాన్ని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు గురువారం సందర్శించి ఎస్సీ, ఎస్టీ కేసును విచారించారు. క్రైమ్ నెంబర్ 122/2024 ఎస్సీ, ఎస్టీ కేసు సంబంధించి గ్రామస్థులను విచారించారు. ఈ సందర్భంగా ఈ కేసుకు సంబంధించిన నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. అంతకు ముందు రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రమేష్, ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నిమ్మనపల్లి, ఆగస్టు 22: పశుబీమా పథకాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పాడిపశువులపై ఆదారపడి జీవనం సాగిస్తున్న రైతులు పశుబీమాను చేసుకోవాలని తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 30వేల ధర కలిగిన పాడి ఆవుకు మూడేళ్లకు గానూ రూ.384లు, 50వేల ధర కలిగిన పాడి ఆవుకు మూడేళ్లకు గానూ రూ.1664లు, 50వేల పైన ధర కలిగిన పాడి ఆవుకు మూడేళ్లకు గానూ రూ.2240లు, బీమా చెల్లించి ప్రయోజనం పొందాలన్నారు.

ఉచిత ఇసుకకు విఘాతంగా మారిన మైనింగ్ మాఫియా

మదనపల్లె అర్బన్,ఆగస్టు 22: వాగుల్లో వంకల్లో, కుంటల్లో ప్రజలకు ఉచిత ఇసుకను ఎత్తనివ్వకేండా మైనింగ్ మాఫియా దౌర్జన్యంగా అడ్డుకొంటూ అక్రమ నిల్వలను ఏర్పాటు చేసుకొంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం మదనపల్లెలో పలు చోట్ల అక్రమ ఇసుక నిల్వలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కమ్మగడ్డవీధి ఎక్స్‌టేన్షన్, బసినికొండ వద్ద, నిల్వ చేసిన వందల లోడ్లు ఇసుకను అక్రమంగా నిల్వ చేయడంతో సామాన్యులకు ఉచిత ఇసుక అందుబాటులోకి రాలేదని వాపోయారు. ఏఐటీయూసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ మంజూరు చేసిన ఇంటికి ఇసుక దొరకడంలేదని, బెంగలూరుకు తరలించడానికి మాత్రం వందల లోడ్లు లభిస్తోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు ఘన సన్మానం


కార్యకర్తలను సన్మానిస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 22: యాప్ ద్వారా టీడీపీ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రచారం చేసి ప్రజలకు చేరువ చేసిన టీడీపీ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్‌ల నుంచి ప్రశంసాపత్రాలు పొందిన తెట్టు మారప్ప, రెడ్డిశేఖర్, తలారి మంజునాథ్, షేక్ అయూ బ్‌బాషా, మంచినీళ్ల ఆనంద్, సయ్యద్‌షావలి, నాగరాజు, పూస మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డిలను జయచంద్రారెడ్డి సత్కరించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, కురబలకోట పార్టీ మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, నాయకులు కేవీ రమణ, సురేష్ తది తరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాలతో ప్రజలను ఇబ్బందులు పెట్టడం తగదు

మదనపల్లె టౌన్, ఆగస్టు 22: మదనపల్లె పట్టణంలో కొందరు స్వార్థ రాజకీయాలతో ప్రజలను ఇబ్బందులు పెట్టడం తగదని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ దుయ్యబట్టారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఇసుకతో ఇబ్బందులు పడుతుంటే సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకొస్తే ఈ పథకాన్ని భ్రష్టు పట్టించేందుకు కొందరు పట్టణంలో తిరుగుతున్న ట్రాక్టర్లు, నిల్వ చేసిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసి వారిని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలోనే ఇసుక రీచ్‌లు లేవని, ఇక్కడి ప్రజలు ఎక్కడికి వెళ్లి ఇసుక రవాణా చేయాలని ప్రశ్నించారు. ప్రజల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఈ కుట్ర రాజకీయాలు చేస్తున్నారని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోలేని వారే, ఇప్పుడు ఇలాంటి పన్నాగం పన్నుతున్నారని ఆయన ఆరోపించారు.

పీహెచ్‌సీలలో సమస్యలు పరిష్కరించాలి


మంత్రికి విన్నవిస్తున్న బీజేపీ నేత ఓసూరి కిరణ్‌కుమార్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 22: పీహెచ్‌సీలలో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌కు విన్నవించారు. వారధి కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సీటీఎంకు చెందిన బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జీ ఓసూరి కరణ్‌కుమార్ మదనపల్లె నియోజకవర్గంలో ప్రజలు ఎదురుకుంటున్న వైద్యశాఖ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మదనపల్లె పట్టణం, మండలంలోని సీటీఎం, బొమ్మనచెరువు, రామసముద్రం, నిమ్మనపల్లె పీహెచ్‌సీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ఘనంగా శంకరయ్య స్వామి ఆరాధనోత్సవాలు

బి.కొత్తకోట, ఆగస్టు22: బి.కొత్తకోట మండలం బీరంగి పంచాయతీ పరిధిలోని శంకరాపురం లో వెలసిన శంకరయ్య స్వామి వారి ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. నాలుగురోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలలో భాగంగా భజనబృంధం ఆధ్వర్యంలో అఖండ రామ కోటిభజన నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి అభిషేకాలు, సహస్ర నామార్చన, నిర్వహించి భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ ఆదాయం పెంచండి : డీఎం

మదనపల్లె అర్బన్, ఆగస్టు22: గ్రామీణ ప్రాంతాల్లో వెళ్లే ఆర్టీసీ బస్సుల ద్వారా ఆర్టీసీకి ఆదాయం పెంచాలని వన్ డిపో డీఎం మూరే వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం స్థానిక వన్ డిపో కార్యాలయంలో మదనపల్లె- తంబళ్లపల్లె మార్గంలో వెళ్లి సిబ్బందితో జీఆర్‌ఈ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆదాయం పెంచడానికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.

దేవదాయ భూములు ఆక్రమిస్తే కేసులు తప్పవు

రామసముద్రం, ఆగస్టు 22: దేవదాయ భూములు ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు రామసముద్రం కేంద్రంలో మఠం భూములను ఆయన పరిశీలించారు. మఠంకు చెందిన 3.16 ఎకరాల భూమిలో కొంత బీసీ హాస్టల్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఆర్.నడింపల్లె, తిరుమలరెడ్డిపల్లె గ్రామాల్లోని వినాయకస్వామి, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాలకు ధూప దీప నైవేద్యం కింద ఖర్చులు చెల్లించడానికి పరిశీలిస్తామన్నారు. బల్లసముద్రం కొండపై వెలసిన వాలేశ్వరస్వామి ఆక్రమితమైన భూములు పరిశీలించి సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ నిర్మలాదేవితో చర్చించి దేవాలయ భూములు సర్వే చేసి హద్దులు గుర్తించాలని కోరారు. ఈవో రమణ, జూనియర్ అసిస్టెంట్ బాల అంకన్న ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కలకడ, ఆగస్టు 22:మండలంలోని కోన మార్గ మధ్యంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో తరుణ్(24) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. కడప పట్టణానికి చెందిన తరుణ్ కోన గ్రామానికి చెందిన ఓ ఎక్స్‌కవేటర్ యజమాని వద్ద క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పని చేస్తున్న ప్రాంతం నుంచి బుధవారం చీకటి పడ్డాక సొంత పని మీద వెళుతున్నాని చెప్పి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే రాత్రైయిన రాకపోవడంతో చుట్టుపక్కల వెతకగా గురువారం ఉదయం ఘటన స్థలంలో ముళ్లపొద్దలో మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం పీలేరు ఆసుపత్రికి తరలించి మృతి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, ఆగస్టు 22: జింకలు అడ్డురావడంతో ఓ ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడిడడంతో మునీంద్ర(26) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు..మండలంలోని మద్దినాయనిపల్లెకు చెందిన మునీంద్ర సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో పెద్దపాళ్యంకు వచ్చి వెళ్తుండగా మార్గం మధ్యంలో జింకలు అడ్డువచ్చాయి. దీంతో వాటిని తప్పించబోయి వాహనం కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 22:అక్రమంగా సారా తరలిస్తున్న శివశంకర్(29) వ్యక్తి అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మండలంలోని కుమ్మరపల్లెకు చెందిన శివశంకర్ అక్రమంగా తరలిస్తుండగా దాడులు నిర్వహించి 4 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పీటీఎంలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 22 : మండల కేంద్రమైన పీటీఎంలోని బస్టాండులో మెగాస్టార్, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ఆయన అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీటీఎం బస్టాండులో బారీ కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం పీటీఎంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ అభిమాన నాయకుడైన చిరంజీవి ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు శంకర, టీడీపీ సీనియర్ నాయకుడు బందార్ల వెంకట్రమణ, మాజీ ఎంపీటీసీ సూరీ, కుమ్మరవారిపల్లె రాజేష్, పాలు గంగాద్రి, మల్లెం శివయ్య, పాల రవి, పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి సమాజ స్థాపనే మానవతా సంస్థ ధ్యేయం

మదనపల్లె టౌన్, ఆగస్టు 22: శాంతి సమాజ స్థాపనే ధ్యేయంగా మానవతా సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ మదనపల్లె యూనిట్ అధ్యక్షుడు ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ సభ్యులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సర్వజన బోధనాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు సి.ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి రమణప్ప, కోశాధికారి హరినాథ్‌బాబు, మానవతా సంస్థ సభ్యులు, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్నాలో మునిగి లారీ డ్రైవర్ మృతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 22: పెన్నానదిలో మునిగి లారీడ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు వారధి సెంటర్‌కు చెందిన బీ.వెంకటరమణయ్య(52)కు మదనపల్లికి చెందిన నాగవేణితో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆయన అన్నమయ్య జిల్లా పీలేరులో నివాసం ఉంటూ లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. తరచూ నెల్లూరు పెన్నావారధి సెంటర్‌లో నివాసం ఉంటున్న చెల్లెలు లక్ష్మి ఇంటికి వచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన వెంకటరమణయ్య చెల్లెలు ఇంటికి వచ్చాడు. 21న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన పీలేరుకు వెళ్లి ఉంటాడని చెల్లెలు లక్ష్మి భావించింది. గురువారం మధ్యాహ్నం పెన్నాబ్యారేజ్ తూర్పువైపున పెన్నానదిలో ఓవ్యక్తి మృతదేహం నీటిపై తేలియాడుతోందని చుట్టుపక్కల వారు అనుకుంటుండగా విన్న ఆమె సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహం చూసి తన అన్నదేనంటూ కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడి ఒంటిపై కట్‌డ్రాయర్ మాత్రమే ఉండగా మిగిలిన దుస్తులు సమీపంలోని గోడపై ఉండడంతో స్నానం చేసేందుకు నదిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి చెల్లెలు లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు.